క్లుప్తంగా

అయ్యప్ప స్వామి ఆలయంలో 30న ఉగాది వేడుకలు

బోట్‌క్లబ్: నగరంలోని రిజర్వ్ లైన్ **అయ్యప్ప** స్వామి ఆలయంలో ఈ నెల 30న **ఉగాది వేడు**కలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు **ఆలయ** పర్సన్ ఇన్‌చార్జి పి.గోపాలకృష్ణ **శుక్రవారం** విలేకర్లకు తెలిపారు. ఉగాది రోజున **ఉదయం** స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అలంకరణ జరుగుతాయన్నారు. సాయంత్రం 5.30కు ప్రముఖ పంచాంగకర్త వక్కలంక రామకృష్ణమ్మ సిద్ధాంతి పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు.

ఘనంగా గోగులమ్మల తీర్థం



పెద కొత్తూరులో గోగులమ్మను దర్శించుకుంటున్న సర్పంచ్ దంపతులు

కరప: మండలంలోని పెద కొత్తూరు, చిన కొత్తూరు గ్రామాల్లోని గ్రామ దేవతలు గోగులమ్మల వారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఫాల్గుణ మాసం అమావాస్య ముందు రోజు రాత్రి ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలు గోగులమ్మ అమ్మవార్లకు జాతర నిర్వహించి, గ్రామస్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, గారడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామ దేవత గోగులమ్మను గురువారం రాత్రి ఊరేగించి, జాతర నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు తీర్థం రోజున అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ చింతా నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ చింతా దుర్గాశ్రీ, నాయకులు చింతా బుజ్జి, చోడిశెట్టి చంటి తదితరులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేషన్ కమిషనర్ భావన



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ భావన

బోట్‌క్లబ్: పన్ను చెల్లింపులకు ఇంకా కేవలం మూడు రోజులు మాత్రమే మిగిలి ఉందని, ఈ నెల 31లోపు అందరూ ఇంటి, కుళాయి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ భావన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం పన్ను వసూళ్లపై అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ వల్ల మూడు రోజులుగా ప్రజలు భారీగా పన్ను బకాయిలు చెల్లించి, వడ్డీ మాఫీ ప్రయోజనం పొందారన్నారు. మూడు రోజుల్లో రూ.మూడు కోట్లకు పైగా పన్నుల వసూళ్లు జరిగినట్టు చెప్పారు. సెలవు దినాలైనప్పటికీ ఈ నెల 30, 31న కూడా అన్ని సచివాలయాలు, మున్సిపల్ ఆఫీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అన్ని కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయన్నారు.

జీజీహెచ్‌కు రూ.6 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేసిన డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

కాకినాడ సిటీ: ట్రస్ట్ హాస్పిటల్స్ (సర్వోత్తమ్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై కల్యాణ్ చక్రవర్తి సీఎస్సార్ నిధుల్లో భాగంగా రూ.6 లక్షల విరాళాన్ని శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ సగిలికి అందజేశారు. కాకినాడ జీజీహెచ్‌లోని పల్మనరీ మెడిసిన్ విభాగానికి బ్రాంకోస్కోప్ వంటి ఆధునిక పరికరాల కొనుగోలుకు వినియోగించాలని డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి కోరారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న గిరిజనులు, పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలన్న సంకల్పంతో ఈ విరాళాన్ని అందించినట్టు చెప్పారు. సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో శనివారం తుని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగే మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాలో 33 ప్రముఖ కంపెనీల్లో 1,235 ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా, ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు, 14 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఈతాపానికి ఆడేద్దాం

- ఎండలకు ఎంతో ఉపశమనం
- డీఎస్ఏలో శిక్షణ ప్రారంభం
- వ్యాయామంతో పాటు ఆరోగ్యం
- స్వీయ రక్షణకు దోహదం



కాకినాడ డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న పిల్లలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అభిరుచులకు, ప్రతిభకు అనుగుణంగా చిన్నారులను తీర్చిదిద్దేందుకు సరైనది వేసవి కాలం. పుస్తకాలతో నిరంతరం కుస్తీ పట్టే పిల్లలను ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి, నైపుణ్యానికి పదును పెట్టేందుకు దోహదపడే సమయం. వేసవి సెలవుల్లో లలిత కళలు, డ్యాన్స్, మ్యూజిక్, క్రీడలు వంటివి నేర్చుకుంటూ, ఆనందోత్సాహాలతో గడపాలనుకునే వారి జాబితాలో ఇప్పుడు స్విమ్మింగ్ కూడా చేరింది. పాఠశాలలకు సెలవులు ఇచ్చారంటే.. చెరువుల్లో, సముద్రంలో, బావుల్లో, కాలువల్లో, నదుల్లో సరదాగా స్నానానికి దిగి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే సంఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో స్వీయ రక్షణకు ఈత (స్విమ్మింగ్) రావాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈత శరీరానికి కావాల్సిన వ్యాయామం కూడా అందిస్తుంది.

డీఎస్ఏలో..

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఇస్తున్న శిక్షణలో ఈ ఏడాది చిన్నారులు ఉత్సాహంగా చేరుతున్నారు. జలకాల జిమ్‌లో ఓనమాలు నేర్చుకుని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో కనబర్చాలనే లక్ష్యంతో వేసవి స్విమ్మింగ్ శిక్షణపై ఆసక్తి చూపుతున్నారు. స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ పర్యవేక్షణలో ఈ శిక్షణను నిర్వహిస్తున్నారు. ఉదయం 5.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేకంగా మహిళలకు సాయంత్రం 4 నుంచి 5 వరకు పూల్‌ను కేటాయించారు. శిక్షణలో చేరిన వారికి ఫిట్‌నెస్‌తో పాటు, ఫ్రీ స్టైల్, బటర్ ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్‌లో శిక్షణ ఇస్తూ, మెళకువలు నేర్పుతున్నారు. డీఎస్ఏలో చిన్న పిల్లలకు నెలకు రూ.వెయ్యి, పెద్దలకు నెలకు రూ.1,500 రుసుము చెల్లించాలి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది శిక్షణలో చేరిన వారి సంఖ్య పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు.

మంచి వ్యాయామం కూడా..

- ఈత సాధన సమయంలో శరీరంలోని అన్ని రకాల కండరాలు, కీళ్లు కదులుతాయి.
- దీనివల్ల శరీరానికి వ్యాయామం అవుతుంది.
- ఊపిరి ఎక్కువ సేపు బిగపట్టి, వదలడం వల్ల ఊపిరితిత్తులు బలంగా తయారవుతాయి.
- పగలు ఏ సమయంలో ఈత నేర్చుకున్నా మంచిదే.
- ఈత వల్ల అనేక రకాల క్యాలరీలు ఖర్చవుతాయి. ఆకలి పెంచుతుంది.
- నిత్యం ఈత కొట్టేవారు ఉత్సాహంగా ఉంటారు. మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- శరీరం దృఢంగా ఉంటుంది.
- చిన్నవారి నుంచి పెద్ద వయస్సు వారు కూడా ఈత నేర్చుకోవచ్చు. కొలనులో నేర్చుకునే వారు రూ.500 వెచ్చిస్తే, మంచి స్విమ్మింగ్ దుస్తులు లభిస్తాయి.
- మూడు వారాలు క్రమం తప్పకుండా నేర్చుకుంటే ప్రావీణ్యం మెరుగవుతుంది.

ఎన్నో ఉపయోగాలు



చిన్నతనం నుంచి స్విమ్మింగ్ నేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సులువుగా అందుతుంది. రక్త సరఫరా మెరుగుపడి, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఎవరైనా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోతే వెంటనే వారిని కాపాడవచ్చు.

– అప్పలనాయుడు, డీఎస్ఏ కోచ్

సద్వినియోగం చేసుకోండి



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో వేసవి శిక్షణతో పాటు, నిరంతర శిక్షణ కొనసాగుతుంది. నైపుణ్యం కలిగిన కోచ్, అసిస్టెంట్ కోచ్ సహాయంతో శిక్షణ అందిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు 89196 42248 నంబరులో సంప్రదించాలి.

– బి.శ్రీనివాస్‌కుమార్, డీఎస్‌డీఓ, కాకినాడ డీఎస్ఏ

డాక్టర్ విష్ణువర్ధన్‌కు పదోన్నతి



కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్‌కు పదోన్నతి లభించింది. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఆయనకు అదనపు డీఎంఈగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నెల రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ కేటాయిస్తారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహంతో పాటు, పలువురు విభాగాధిపతులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వరూ..

మంత్రిని కోరిన బీజేపీ జిల్లా నేత

బోట్‌క్లబ్: ప్రభుత్వం భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీకి తగిన ప్రాధాన్యమివ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణను పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కోరారు. అధికార కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన మంత్రిని శుక్రవారం ఆయన కలుసుకున్నారు. దేవాలయాలు, సత్రాలు, మార్కెట్ కమిటీలు, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లలో తమ పార్టీ నాయకులకు చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. నామినేటెడ్ పదవుల్లో కూటమి నాయకులకు సమ ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

సబ్ జైలు పరిసరాల్లో తనిఖీ

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ లీగల్: వివిధ నేరాలపై కాకినాడ స్పెషల్ సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితులకు మత్తు పదార్థాలు బయట నుంచి ఎలా వెళ్తున్నాయని కాకినాడ వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గరావు శుక్రవారం తనిఖీ చేపట్టారు. 'సబ్‌జైలులో విచ్చలవిడిగా గంజాయి' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం భవనం పరిసరాల్లో వన్ టౌన్ సీఐతో పాటు, సబ్ జైల్ సూపరింటిండెంట్ ఎం.వీరబాబు, పోలీసులు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఇలాఉండగా కాకినాడ స్పెషల్ సబ్ జైల్‌లో అప్పుడప్పుడూ బయట వ్యక్తుల ద్వారా సిగరెట్లు, బీడీలు, ఖైనీ పాకెట్లు వంటి నిషేధిత వస్తువులు సబ్ జైల్‌లోకి వస్తున్నాయని కాకినాడ సబ్ జైల్ సూపరింటిండెంట్ ఓ ప్రకటనలో తెలిపారు. గోడ పైనుంచి ఆయా వస్తువులను సబ్ జైలు సిబ్బంది పట్టుకుని ఉంచామన్నారు. గతంలో జరిగిన సంఘటన నేపథ్యంలో వన్ టౌన్ పోలీసులను నిఘా పెంచమన్నట్టు చెప్పారు. అలాగే సబ్ జైల్‌లోకి ఇతర మత్తు పదార్థాలు రాలేదని తెలిపారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పరిశీలిస్తున్న సీఐ, సబ్ జైల్ సూపరింటిండెంట్ తదితరులు

ఇద్దరి అరెస్టు

కాకినాడ క్రైం: సబ్ జైల్‌లో ఉన్న ఖైదీలకు మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సబ్ జైల్ సీసీ ఫుటేజీలు పరిశీలించి శుక్రవారం రాత్రికి నిందితులను గుర్తించారు. కాకినాడ డెయిరీ ఫారానికి చెందిన గోపిశెట్టి బాలసతీష్, స్వర్ణాంధ్ర కాలనీకి చెందిన దారపు రామిరెడ్డిను వారి ఇళ్ల వద్ద అదుపులోని తీసుకుని, వారి నుంచి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి లభ్యతపై విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. స్వల్ప వ్యవధిలో నిందితులను పట్టుకున్న సీఐ నాగదుర్గారావును ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.



గోపిశెట్టి బాలసతీష్



దారపు రామిరెడ్డి

వ్యక్తి అదృశ్యం



రెడ్డి లీలాకృష్ణ(ఫైల్)

కరప: తన భర్త అదృశ్యమైనట్టు భార్య ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, కరప గ్రామానికి చెందిన రెడ్డి అనూషతో, అదే గ్రామానికి చెందిన రెడ్డి లీలాకృష్ణ(33)కు ఏడాది క్రితం వివాహమైంది. కరప గ్రామానికి చెందిన మహిళతో లీలాకృష్ణ తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో లీలాకృష్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. కరప, పరిసర గ్రామాల్లో, బంధువులు, స్నేహితుల వద్ద గాలించినా అతడి ఆచూకీ లభించ లేదు. దీంతో శుక్రవారం రాత్రి అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికాభివృద్ధికి పరిశోధనలు కీలకం

ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినీకుమారి



సెమినార్ ప్రొసీడింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నూతన ఆవిష్కరణలు, నానోస్కేల్ పరిమాణాలతో కొత్త పదార్థాలు, టెక్నాలజీ అభివృద్ధి చేయడంలో రసాయన, భౌతిక శాస్త్ర సన్నిహిత పరిశోధనలు కీలకపాత్ర పోషిస్తాయని ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి అన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నానో మెటీరియల్స్, నానో టెక్నాలజీ అనే అంశంపై జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించిన డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో అనేక సాంకేతిక మార్పులు సంభవిస్తున్నాయని చెప్పారు. సీనియర్ సైంటిస్ట్ ముదిత్ దీక్షిత్ మాట్లాడుతూ, మంచి దృక్పథంతో ఆలోచించగలిగేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ సెమినార్ ప్రొసీడింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, నానో టెక్నాలజీ మరింత విస్తృతంగా దూసుకుపోతుందని, ఎలక్ట్రానిక్ పరికరాలు సూక్ష్మ స్థాయికి మార్పు చెందాయన్నారు. ఇగ్నో రిటైర్డ్ సీనియర్ రీజనల్ డైరెక్టర్ శివస్వరూప్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ముఖ్య విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారి, సిరి, ఫిజిక్స్ విభాగాధిపతి జి.రాజు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా యూనివర్సిటీతో ఎంవోయూపై చర్చ



కార్యక్రమంలో పాల్గొన్న ఇరు వర్సిటీల ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ, ఆస్ట్రేలియా యూనివర్సిటీ ఆఫ్ న్యూకాజిల్ మధ్య ఎంఓయూపై చర్చ జరిగింది. శుక్రవారం వీసీ సమావేశపు హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఫారిన్ వర్సిటీ ఇన్‌చార్జి డైరెక్టర్ స్వర్ణకుమారి అధ్యక్షత వహించారు. న్యూకాజిల్ ప్రొ. వైస్ చాన్సలర్ డాక్టర్ అలెగ్జాండర్ ఒనిస్కో, సౌత్ ఆసియా యూనివర్సిటీ డ్రైవ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ గురుప్రీత్‌సింగ్ పాల్గొన్నారు. ఇరు వర్సిటీలు అందిస్తున్న కోర్సులు, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ పోగ్రాంపై చర్చించారు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ పోగ్రాం, జాయింట్ రీసెర్చ్ పోగ్రాం, ప్రొఫెషనల్ టీచింగ్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ పోగ్రాం, మల్టీ డిసిప్లినరీ పోగ్రాం సంయుక్తంగా నిర్వహించవచ్చని ఆయా ప్రతినిధులు పేర్కొన్నారు. ఉమ్మడి విద్యా కార్యక్రమాల అభివృద్ధి, జాయింట్ సమావేశాలు, కెపాసిటీ బిల్డింగ్ పోగ్రాం నిర్వహించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం ద్వారా జేఎన్‌టీయూకే ఖ్యాతి అంతర్జాతీయంగా పెరుగుతుందని వీసీ ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్ర, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మెగా రక్తదానం

జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామరావు, వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొని, శిబిరాన్ని ప్రారంభించారు. వర్సిటీ మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజుతో పాటు, కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ తొలుత రక్తదానం చేయగా, అనుబంధ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

ఉమ్మడి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీలక్ష్మి

కాకినాడ లీగల్: అనవసర గొడవల్లో వెళ్లడం వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని ఉమ్మడి జిల్లా రాజమహేంద్రవరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ(సీనియర్ సివిల్ జడ్జి) ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక స్పెషల్ సబ్ జైలులో నిందితులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోతే, తమ సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసఫ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్యకు ఆలయాల ముస్తాబు

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారు

బోట్‌క్లబ్: నగరంలో ఉన్న పలు నూకాలమ్మ అమ్మవారి ఆలయాల్లో కొత్త అమావాస్య వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుద్దీపాలంకరణ చేశారు. భక్తులను రాకను దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం బయటకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పెద్ద మార్కెట్‌లో ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ ఎం.మురళీవీరభద్రరావు తెలిపారు. శుక్రవారం రాత్రి జాతర మహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. గరగల నృత్యం ఆకట్టుకుంది. కాళికాదేవి నృత్యాలు, బ్యాండ్ మేళం, కేరళ వాయిద్యం, తీన్మార్, కోలాటం, నృత్యాలు భక్తులను అలరించాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 29న అమావాస్య తీర్థం, రాత్రి సిరిబొమ్మ ఉత్సవం, రాత్రి 11 గంటలకు అమ్మవారికి నివేదన జరుగుతుంది. అనంతరం అమ్మవారి ఆలయ తలుపులు మూసివేసి, ఏప్రిల్ ఒకటిన మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనం కల్పిస్తారు. ఏప్రిల్ 10న అమ్మవారి ఆలయంలో భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టూటౌన్ నూకాలమ్మ ఆలయంలో..

కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి పేరొందిన టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. శనివారం రాత్రి ఆలయంలో పెద్ద జాగారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆలయంలో తెల్లవార్లూ జాతర మహోత్సవం జరుగుతుందన్నారు. అమ్మవారి గరగల నృత్యం, బ్యాండు మేళం, కొమ్ముల డాన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్‌ను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమించారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్ల ఏర్పాట్లపై ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కొత్త అమావాస్య ఉత్సవాలకు ముస్తాబైన టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయం



ఆలయం వద్ద భారీ విద్యుత్ సెట్టింగు

నూకాలమ్మకు వెండి తోరణం సమర్పణ

బోట్‌క్లబ్: కొత్త అమావాస్య సందర్భంగా స్థానిక టూటౌన్ నూకాలమ్మ అమ్మవారికి కాకినాడ నగరానికి చెందిన దవులూరి దీపిక రూ.23 వేల విలువైన వెండి తోరణం సమర్పించారు. శుక్రవారం తోరణాన్ని దీపిక తండ్రి దవులూరి రాంబాబు చేతులమీదుగా ఈవో ఉండవల్లి వీర్రాజుకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ తలాటం సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వెండితోరణం ఈవోకు అందిస్తున్న రాంబాబు

బాలల సంరక్షణే ప్రధాన ధ్యేయం

ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: బాలల సంరక్షణ చట్టాలపై చర్చించి తగిన సూచనలిచ్చేందుకు పలు స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, జీఎంఎస్‌కే, డబ్ల్యూఎంఎస్‌కేలతో శుక్రవారం సాయంత్రం ఎస్పీ బిందుమాధవ్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పోక్సో, చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్, జువైనల్ జస్టిస్ యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ బృందాలు గ్రామ స్థాయిలో ఏర్పడి, బాలల సంరక్షణ కోసం పనిచేయాలన్నారు. పాఠశాల స్థాయిలో బాలికలతో శక్తి బృందాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. శక్తి యాప్‌లు ఇన్‌స్టాల్ చేయించి, బాలికలకు యాప్ వినియోగించే విధానం, ప్రయోజనాన్ని వివరించాలన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్, అధికారులు

ఇఫ్తార్ విందు: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఉన్న మస్జిద్-ఎ-షారీఫేన్‌లో మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎస్పీ బిందుమాధవ్ పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొని, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విందులో అదనపు ఎస్పీ ఏఆర్ శ్రీనివాస్, ట్రైనీ ఐపీఎస్‌లు కుమారి, సుస్మిత పాల్గొన్నారు.

న్యాయ విచారణ కోసం కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీలు చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ క్రైస్తవ సంఘాలు, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఆయన కుటుంబీకులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేయాల్సి అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. లేనిపక్షంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శాంతియుత ర్యాలీలు చేస్తామని చెప్పారు. క్రైస్తవ బోధకుడు పాస్టర్ కేవీడీ ప్రసాద్, ప్రేమకుమార్ మాట్లాడుతూ, శాంతి సమాజాన్ని కోరుకునే క్రైస్తవ బోధకుడు మృతిపై అనుమానాలు రావడం దురదృష్టకరమన్నారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్.అచ్యుతాపురం, అంబేడ్కర్ జంక్షన్, గాంధీనగర్, జేఎన్‌టీయూకే తదితర ప్రాంతాల్లో శాంతిర్యాలీలు నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు కె.బోడకొండ, ఎ.భవాని, టి.ప్రేమ్‌కుమార్, కొల్లాబత్తుల అప్పారావు, బచ్చల చంద్రశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.